# ప్రజల సంతృప్తే విజయ సంకేతం



అమలాపురం గోల్డ్ మార్కెట్‌లో బంగారు, వెండి వ్యాపారులను ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ తదితరులు



అమలాపురంలో మంత్రి విశ్వరూప్‌కు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

- అమలాపురంలో మంత్రి విశ్వరూప్ ప్రచారానికి అపూర్వ స్పందన
- ఎదురేగి స్వాగతం పలికి హారతులు పట్టిన జనం

**అమలాపురం టౌన్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజల సంతృప్తే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ సంకేతంగా స్పష్టంగా కనిపిస్తోందని నియోజకవర్గ పార్టీ అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం పట్టణంలో ఆదివారం ఆయన ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పట్టణంలోని 24, 25, 26, 27 వార్డులో మంత్రి విశ్వరూప్ గడప గడపకూ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. అమలాపురం పట్టణంలో మౌలిక వసతుల పరంగా జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. గోల్డ్ మార్కెట్ అయిన దేవాంగుల వీధిలో మంత్రి విశ్వరూప్ ప్రతి దుకాణంలోకి వెళ్లి బంగారు, వెండి వ్యాపారులను వైఎస్సార్ సీపీకి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా దేవాంగుల వీధిలోని పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం చైర్మన్ బిళ్ల మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో మంత్రికి స్వాగతం పలికారు. వార్డుల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి మహిళలను ఓట్లు అభ్యర్థించారు. అంతర్గత రోడ్లలో ముందు ఎన్నికల ప్రచార రథం కదులుతుండగా మంత్రి విశ్వరూప్‌కు ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు. కొందరు మహిళలు ఆయనకు హారతులిచ్చి అభిమానాన్ని చాటారు.

### అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

ఎన్నికల ప్రచారంలో మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని అమలు చేసిన ఘనత సీఎం జగన్ సారథ్యంలోని వైఎస్సార్ సీపీకి దక్కుతుందన్నారు. చేసిన అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ఎన్నికల్లో ధైర్యంగా ప్రజల వద్దకు వెళ్తున్నామన్నారు. అన్ని వర్గాలకు న్యాయం చేస్తూ, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా పాలనను కొత్త పుంతలు తొక్కిస్తూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. జగన్ పాలనపై ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారని, మళ్లీ ముఖ్యమంత్రిని చేసే అవకాశం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని చెప్పారు. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేయడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును గుర్తు పెట్టుకుని ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, మున్సిపల్ వైస్ చైర్మన్లు రుద్రరాజు నానిరాజు, తిక్కిరెడ్డి వెంకటేష్, మార్కెటింగ్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి దేవరపల్లి గీత, మున్సిపల్ కౌన్సిలర్లు చిట్టూరి పెదబాబు, దొంగ నాగ సుధారాణి, బండారు గోవింద్, గొవ్వాల రాజేష్, చిత్రపు రామకృష్ణ, యన్నాబత్తుల పద్మ, నాగారపు వెంకటేశ్వరావు, పార్టీ అనుబంధ కమిటీల నాయకులు కముజు రమణ, కామిశెట్టి శ్రీనివాస్, ఉండ్రు వెంకటేష్, గనిశెట్టి రమణలాల్, వంటెద్దు వెంకన్నాయుడు, భరణికాన బాబు, తాళాబత్తుల లక్ష్మణరావు, యండమూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పలువురికి ఎమ్మెల్యే పొన్నాడ పరామర్శ



సుంకరపాలెంలో శ్రీనును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

**తాళ్లరేవు:** మండల పరిధిలోని పలు బాధిత కుటుంబాలను ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పితాని బాలకృష్ణ తదితరులు ఆదివారం పరామర్శించారు. పి.మల్లవరంలో పితృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు కె.జగన్‌ను పరామర్శించి ఓదార్చారు. అదేవిధంగా మాతృ వియోగంతో బాధపడుతున్న సుంకరపాలెం ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీనును ఎమ్మెల్యే పొన్నాడ, పితాని పరామర్శించారు. బాధిత కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొంతు మోహన్, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు మట్టపర్తి లోవరాజు, కాశి లక్ష్మణ స్వామి, చింతాకుల రాంబాబు, గురజాపు లోవరాజు, శీలం గోవిందు తదితరులున్నారు.

## వెంకన్న ఆలయంలో ఆధ్యాత్మిక శోభ



స్వామిని వాహనంపై ఊరేగిస్తున్న వేద పండితులు

**ఆత్రేయపురం:** కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాలు ఆదివారం ఆధ్యాత్మికతతో శోభిల్లింది. చతుర్వేద పారాయణ, ద్రవిడ పారాయణ, దివ్య ప్రబంధనం తదితర వేద కార్యక్రమాలను వేద పండితులు వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని పల్లకీపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేద పండితులు పాల్గొని చతుర్వేద, వేద పారాయణలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వార్ని సింహ, గరుడ వాహనంపై ఊరేగించారు. అధ్యయనోత్సవాల గురించి భక్తులకు వేదపండితులు శాస్త్రోక్తంగా వివరించారు. దివ్య ప్రబంధనం, సర్వాధికారము ద్వాపరయుగాంత సమయంలో శ్రీకృష్ణ పరమాత్మకు కలిగిన నిర్వేదన అన్నారు. ఆయన ఆశయం సఫలం చేయడం కోసం ఆళ్వార్లు తమ భగవద్గీత అనుభవాన్ని మొదటి నుంచి చివరి వరకు తిరువాయ్‌మొళ్లిగా అనుగ్రహించారు. అనంతరం ఆళ్వారులు ప్రసాదా వినియోగ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## విశ్వరూప్ విజయానికి కృషి చేస్తాం



మంత్రి విశ్వరూప్‌ను కలిసిన వనచర్లవారి వీధికి చెందిన శెట్టిబలిజ నాయకులు

**అమలాపురం రూరల్:** రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ విజయానికి శాయశక్తులా కృషి చేస్తామని పట్టనంలోని వనచర్లవారి వీధికి చెందిన శెట్టిబలిజ నాయకులు బొంతు వెంకటరమణ, చప్పిడి బాబ్జి, కుడుపూడి ఈశ్వరరరావు తదితరులు అన్నారు. ఉభయ రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆధ్వర్యంలో ఆదివారం భట్నవెల్లిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి విశ్వరూప్‌ను కలిసి తమ మద్దతు తెలియజేశారు. 29వ వార్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, జిల్లా కార్యదర్శి కముజు వెంకటరమణ, కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ, ముంగర ప్రసాద్, యిళ్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



పెదపళ్ల పీహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

**ఆలమూరు:** మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల్లో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపు మేరకు కొత్తపేట డివిజన్ అదనపు జిల్లా వైద్యాధికారి ఎం.సుమలత ఆదేశాల మేరకు ఆయా పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది భారీ ర్యాలీలు నిర్వహించి 'నా ఆరోగ్యం–నా హక్కు' అంటూ నినాదాలు చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ఆవశ్యకతను వివరిస్తూ ప్రజలను చైతన్యవంతం చేశారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, హెచ్‌ఈలు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి పాల్గొన్నారు.

## నేటి నుంచి ఓటర్ ఇన్‌ఫర్మేషన్ స్లిప్పుల పంపిణీ



ఓటర్ ఇన్‌ఫర్మేషన్ స్లిప్పుల బండిళ్లను బీఎల్‌ఓలకు అందిస్తున్న ఏఆర్‌ఓ మునిస్వామి

**యానాం:** పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి ఈ నెల 19న పోలింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో యానాంలో సోమవారం నుంచి బూత్‌ల వారీగా ఓటర్ ఇన్‌ఫర్మేషన్ స్లిప్పులను పంపిణీ చేస్తారని అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ మునిస్వామి తెలిపారు. ఆదివారం స్థానిక ఆర్‌ఏఓ ఆఫీసులో ఓటర్ ఇన్‌ఫర్మేషన్ బండిళ్లను ఆయన ఆయా బీఎల్‌ఓలకు అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని 33 పోలింగ్ బూత్‌లకు 33 మంది బీఎల్‌ఓలను నియమించామని, ఈ నెల 12 వరకూ పంపిణీ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దండయుత పాణి, ఎలక్షన్ శాఖ ప్రతినిధి తిరుకోటి అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

### అంతర్వేదిలో సప్తాహ జ్ఞానయజ్ఞం

**సఖినేటిపల్లి:** అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం మద్భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞం కార్యక్రమం వైభవంగా మొదలైంది. పండిత రత్న ఎంటీ ఆళ్లార్ స్వామితో ఆదివారం నుంచి 13వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు భక్త బృందం తెలిపింది. ఆలయ ఏసీ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

## వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలిసిన రాజీనామా చేసిన ఊబలంక వలంటీర్లు

**రావులపాలెం:** మండలంలోని ఊబలంక గ్రామానికి చెందిన 49 మంది గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేశారు. ఆదివారం వైఎస్సార్ సీపీ కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డిని కలిసి, చిర్ల గెలుపు కోసం, జగనన్న గెలుపుకోసం కృషి చేస్తామన్నారు. వలంటీర్లు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి జగనన్న ప్రభుత్వంలో వలంటీర్లు ప్రతి పథకాన్ని ఇంటి వద్దకే అందించామన్నారు. అలాగే ఉన్నత వర్గాల వారికి కూడా ప్రభుత్వ కార్యాలయాలలో ఏ విధమైన అవసరం ఉన్నా సహాయపడ్డామని, వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు ప్రతి నెలా ఒకటో తేదీనే ఉదయాన్నే అందించేవారమన్నారు. చంద్రబాబునాయుడు సూచనలతో ఒక సంస్థ చేసిన ఫిర్యాదుతో నేడు పింఛన్ లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారన్నారు. కూటమి నేతల నీచరాజకీయాలకు బుద్ధి చెప్పేందుకే రాజీనామాలు చేసి ప్రజలలోకి వెళ్లి వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి జగ్గిరెడ్డి గెలుపుకు, జగనన్న గెలుపుకు కృషి చేస్తామన్నారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ప్రభుత్వం తరఫున ప్రజలకు సేవ చేసి, ఇప్పుడు మా గెలుపునకు కృషి చేయడానికి సిద్ధమైన వలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు. వారి వెంట గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మల్లిడి రామిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి సుబ్బిరామిరెడ్డి, యూత్ లీడర్ నడింపల్లి వర్మ, మేడపాటి చంద్రాసుబ్బారెడ్డి, సచివాలయం కన్వీనర్లు మేడపాటి శ్రీనివాసరెడ్డి, చిన్నం సోమిరెడ్డి, ద్వారంపూడి హరీష్ రెడ్డి, చిన్నం వెంకట కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

## ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి



అంబాజీపేటలో వేసవి తాపానికి నిర్మానుష్యంగా ఉన్న ప్రధాన రహదారి

**అంబాజీపేట:** ఎండలు మండుతున్నాయి... ఓ పక్క పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. భానుడి ప్రతాపం గత నాలుగు రోజుల నుంచి రోజురోజుకీ పెరుగుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిదైతే చాలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడాల్సిన పరిస్థితి. కూలీ పనులు, వ్యవసాయ పనులు చేసుకునే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బయట ఎండల వల్ల విపరీతమైన ఉక్కపోత, వేడిగాలి తాళలేక పొలాల్లో నీడల్లో సేద తీరుతున్నారు. వృద్ధులు, పిల్లలు, బాలింతలు, గర్భిణులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మండలంలో గత నాలుగు రోజుల నుంచి 36 డిగ్రీల నుంచి 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో రోడ్లపై ప్రయాణించలేక వాహన చోదకులు ఎక్కడ చెట్ల నీడ కనిపిస్తే అక్కడ ఆగిపోయి సేద తీరుతున్నారు. వాతావరణం చల్లబడిన వేళలో మళ్లీ ప్రయాణం ప్రారంభిస్తున్నారు. ఇదే విధంగా రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగితే ప్రజలకు వడ దెబ్బ తగిలే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. వీలున్నంత వరకు నీడ ప్రదేశాల్లో ఉండాలని, మంచి నీరు, మజ్జిగ, కొబ్బరి బొండాలు తాగితే మంచిదని సూచిస్తున్నారు. సమయానికి భోజనం చేయాలని, పిల్లలు, వృద్ధులు ఎండల్లో తిరగకూడదని తెలిపారు.

## ఆనందరావుకు ఉగాది పురస్కారం



హెచ్‌ఎం ఆనందరావుకు ఉగాది పురస్కారాన్ని అందిస్తున్న కత్తిమండ ప్రతాప్ తదితరులు

**పి.గన్నవరం:** జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పోతవరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కత్తుల ఆనందరావు ఆదివారం అమలాపురంలో జరిగిన జాతీయ శతాధిక సమ్మేళనంలో ఉగాది పురస్కారాన్ని అందుకున్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు తెలుగు భాషపై ఆసక్తి కలిగించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు గాను ఆనందరావుకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ప్రపంచ తెలుగు సాహిత్య సాంస్కృతిక అకాడమీ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, సినీ కళాకారుడు గుర్రం రామకృష్ణ చేతుల మీదుగా ఆనందరావు ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

## క్లుప్తంగా

### ఆరోగ్యానికి నడక మంచిది



సైకిల్ ర్యాలీ ప్రారంభిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

**అమలాపురం టౌన్:** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నడక ఆరోగ్యానికి మంచిదన్న నినాదాన్ని ప్రజలకు తెలియజేసేందుకు అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ సభ్యులు పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆదివారం స్థానిక గడియారం స్తంభం సెంటరు నుంచి ప్రారంభించిన ర్యాలీ పుర వీధుల్లో సాగింది. ర్యాలీలో క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్, డాక్టర్ విష్ణుమూర్తి, వాకర్స్ క్లబ్ ప్రతినిధులు వలవల నాయుడు, పచ్చిగోళ్ల రాజా, ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు, తేతలి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఎఫ్-3 ఫౌండర్ జానీకి సత్కారం



జానీని సత్కరిస్తున్న ముస్లిం నాయకులు

**అమలాపురం టౌన్:** ఎఫ్–3 ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి.జానీని స్థానిక ముల్లా ముస్తాఫా మసీదులో ముస్లిం పెద్దలు ఆదివారం ఘనంగా సత్కరించారు. గత నాలుగేళ్లుగా ఎఫ్–3 ఫౌండేషన్ ద్వారా ప్రతి శుక్రవారం దాదాపు వంద మందికి, ప్రతి మంగళవారం 50 మంది పేదలకు ఆహారాన్ని అందించడమే కాకుండా రూరల్ మండలం ఇమ్మిడివరప్పాడులోని మదర్ థెరిస్సా వృద్ధాశ్రమంలో ప్రతి గురువారం అల్పాహారం, భోజనం ఏర్పాటు చేస్తున్న ఆ సంస్థ సేవలను ముస్లిం పెద్దలు కొనియాడారు. ఆ సేవా సంస్థకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు జానీని అభినందించారు. కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఎండీ అమీర్, ఎండీ ఆజామ్ తదితరులు పాల్గొన్నారు.

### గోశాలకు విరాళాలు



గోశాలను సందర్శించిన డాక్టర్ ధన్వంతరి నాయుడు తదితరులు

**అమలాపురం టౌన్:** స్థానిక శ్రీగౌతమ మహర్షి గోసంరక్షణ సమితి గోశాలకు పలువురు విరాళాలను సమకూర్చారు. ఆదివారం గోశాలను సందర్శించిన పట్టణానికి చెందిన ఎముకల వైద్య నిపుణుడు డాక్టర్ కొమ్ముల ధన్వంతరినాయుడు రూ.10 వేలు, నల్లా స్వామి రూ.7,500, వంటెద్దు స్వామినాయుడు, జీఎస్ ఆర్ మోహనరావు, డీవీవీ సత్యనారాయణ, ఎస్ఎస్ సుబ్రహ్మణ్యప్రసాద్ రూ.5 వేలు విరాళాలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ కొమ్ముల ప్రియాంక, గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు, గోసేవకులు కేవీ మావుళ్లయ్య, లింగోలు విస్సు, అరిగెల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

### కురంగేశ్వరునికి లక్ష రుద్రాక్ష పూజ



లక్ష రుద్రాక్ష పూజలందుకున్న కురంగేశ్వర స్వామి

**తాళ్లరేవు:** పవిత్ర మాస శివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం పాతకోరంగి బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వర స్వామివారికి లక్ష రుద్రాక్ష పూజను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కేఆర్‌కే సాయిప్రసాద్ నేతృత్వంలో స్వామివారికి అభిషేకాలు, విశేష పూజలు, లక్ష రుద్రాక్ష పూజ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**యానాం:** పుదుచ్చేరి డిస్ట్రిక్ట్ కోర్టుల్లో ఖాళీగా ఉన్న గ్రూప్–బీ, సీ పోస్టులతో పాటు టైపిస్ట్, క్లర్క్, జూనియర్ అండ్ సీనియర్ గ్రేడ్ స్టెనోగ్రాఫర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మద్రాసు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ గ్రేడ్ స్టెనో–6 పోస్టులు, జూనియర్‌గ్రేడ్–9 పోస్టులు, ట్రాన్స్‌లేటర్–3, జూనియర్ క్లర్క్–23, టైపిస్ట్–13, డ్రైవర్–1 పోస్టు, ఎంటీఎస్–20(జనరల్) ఖాళీలు ఉన్నాయన్నారు. ట్రాన్స్‌లేటర్ పోస్టులకు తెలుగు, మలయాళం మెయిన్ సబ్జెక్టుగా డిగ్రీ పాసై రాయడం, మాట్లాడటం రావాలన్నారు. అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎంహెచ్‌సీ.టీఎస్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. దరఖాస్తులు చేరేందుకు ఈ నెల 23 ఆఖరు తేదీగా నిర్ణయించారన్నారు.

### ఓటు విలువను గుర్తించాలి



శరత్‌బాబును సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యవరప్రసాద్ తదితరులు

**అమలాపురం రూరల్:** ప్రతిఒక్కరూ ఓటు విలువను గుర్తించి తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కాకినాడ జిల్లా రేట్ ఫియర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వైడీ రామారావు అన్నారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో ఆదివారం వాకర్స్ హెల్త్ క్లబ్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడి శరత్‌బాబు వాకర్స్ ఆరోగ్యం గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ముఖ్య అతిథులు రామారావు, శరత్‌బాబులను క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి వలవల నాయుడు, కోశాధికారి పచ్చిగోళ్ల రాజా, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ రాఘవేంద్రరావు, డాక్టర్ సీహెచ్ విష్ణుమూర్తి, ఏరియా కోఆర్డినేటర్ గోకరకొండ నాగేంద్ర, మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పద్మావతి, అన్యం రాంబాబు, రంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### క్షతగాత్రులకు పరామర్శ



కిమ్స్‌లో క్షతగాత్రులను పరామర్శిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు సంపదరావు

**ఉప్పలగుప్తం:** ముమ్మిడివరం నగర పంచాయతీ బొండాయికోడు తూము వద్ద 216 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చల్లపల్లికి చెందిన కె.సుహాసిని, కాగిత దుర్గారత్నం, బుంగా నరసాయమ్మ, జొన్నాడ ధనలక్ష్మి, కూనవరానికి చెందిన బడుగు రాజేశ్వరి, ఎస్.లోవకుమారిలు గాయపడి అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రులను జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు పరామర్శించి ధైర్యం చెప్పి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

### విద్యుత్ స్తంభంపై తీగలను తొలగించారు



విద్యుత్ స్తంభంపై అల్లుకున్న తీగలను తొలగించిన దృశ్యం

సాక్షి స్పందన

**ఉప్పలగుప్తం:** స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో పంట కాలువ చెంతనే ఉన్న విద్యుత్ స్తంభంపై పాదు జాతి తీగలు ఎగబాకడంపై 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన ఆదివారం సాక్షి పత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో స్తంభంపై అల్లుకున్న తీగలను సిబ్బంది ఆదివారం తొలగించారు. సమస్యకు పరిష్కారం లభించటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

### బాదం చెట్టుపై వినాయకుని ప్రతిరూపం



బాదం చెట్టు కాండంపై వినాయక రూపాన్ని పోలిన దృశ్యం

**అమలాపురం టౌన్:** బాదం చెట్టు కాండంపై సహజ సిద్ధంగా ఏర్పడిన వినాయకుడి ప్రతిరూపం కనిపించడంతో భక్తులు ఆ దృశ్యాన్ని ఆసక్తిగా తిలకిస్తున్నారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల రోడ్డులో లయన్స్ హాలు పక్కన ఖాళీ స్థలంలో ఉన్న బాదం చెట్టు కాండంలో పైకి ఉబ్బినట్టుగా వచ్చిన భాగం వినాయకుని తల, చెవులు, తొండం పోలినట్టు ఉండడంతో ఈ వింతను చూసేందుకు స్థానికులు ఆదివారం తరలి వచ్చారు.